# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 13-11-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

❖ భారతదేశం 2047 నాటికి వికసిత్ భారత్‌గా మారే ప్రయాణంలో ప్రవాస భారతీయులు ముఖ్య పాత్ర పోషిస్తున్నారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.

❖ కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన ఎగుమతి ప్రోత్సాహక మిషన్ (EPM) ప్రపంచ పోటీతత్వాన్ని పెంచుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

❖ బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు రేపు జరుగనుంది.

❖ కేరళ, మాహేలోని పలు ప్రాంతాల్లో రాగల రెండు రోజులలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (imd) వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం 2047 నాటికి వికసిత్ భారత్‌గా మారే ప్రయాణంలో ప్రవాస భారతీయులు ముఖ్య పాత్ర పోషిస్తున్నారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. బోట్స్వానా పర్యటనలో ఉన్న రాష్ట్రపతి అక్కడ భారతీయలను ఉద్దేశించి ఈరోజు ప్రసంగించారు. బోట్స్వానాలోని భారతీయులు దేశం ఆర్థికవృద్ధికి, ఉపాధి కల్పనకు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. వసుధైవ కుటుంబకం దార్శనికతను సాకారం చేయడంలో వారు చేస్తున్న ప్రయత్నాలు దేశానికి గర్వకారణమని రాష్ట్రపతి పేర్కొంటూ....

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర మంత్రివర్గం నిన్న ఆమోదించిన ఎగుమతి ప్రోత్సాహక మిషన్ (EPM) ప్రపంచ పోటీతత్వాన్ని పెంచి, వ్యాపార కార్యకలాపాలను సజావుగా సాగేలా చేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. భారతదేశం స్వావలంబన దేశంగా మారడానికి ఇది ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలను ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం వేదికగా ప్రశంసించారు. ఎగుమతి ప్రోత్సాహక మిషన్ (EPM) ఎగుమతి పోటీతత్వాన్ని మెరుగుపరుస్తుందని, MSMEలు, మొదటిసారి ఎగుమతి చేసేవారికి సహాయపడుతుందన్నారు.

కీలక ఖనిజాలకు రాయల్టీ రేట్లను హేతుబద్ధీకరించాలనే మంత్రివర్గం నిర్ణయం స్థిరత్వం, స్వావలంబనను పెంచుతుందని ప్రధానమంత్రి తెలిపారు. ఈ నిర్ణయం వల్ల ఎగుమతి రంగం బలోపేతం కావడంతో పాటు కొత్త ఉద్యోగ అవకాశాలను సృష్టిస్తుందని నరేంద్రమోదీ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = =

భారతదేశం క్షయ వ్యాధి నియంత్రణలో ఘణనీయమైన మెరుగుదల నమోదు చేసిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. 2015 నుండి చేపట్టిన చర్యల ద్వారా టీబీ వ్యాధి తగ్గుదలలో విజయం సాధించామన్నారు. ఇది ప్రపంచ వ్యాప్తంగా తగ్గుదల రేటు కంటే దాదాపు రెండింతలు అని ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) గ్లోబల్ టీ బీ నివేదిక 2025 పేర్కొందని ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం వేదికగా వెల్లడించారు. చికిత్స పరిధిని విస్తరించడం, నిరంతర కృషి ఈ తగ్గుదల రేటుకు కారణమన్నారు. ఈ విజయాన్ని సాధించడానికి కృషి చేసిన వారిని ప్రశంసించిన ప్రధానమంత్రి... ఆరోగ్యకరమైన, దృఢమైన భారతదేశాన్ని నిర్మించడంలో కట్టుబడి ఉండాలని ఆకాంక్షించారు.

= = = = = = = = = = = = = = = = = =

బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు రేపు జరగనుంది. 38 జిల్లాల్లోని 46 కేంద్రాలలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (EVM)ల ద్వారా ఈ లెక్కింపు ప్రక్రియ రేపు ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుంది. పోలింగ్‌లో ఉపయోగించిన EVMలు, VVPATలను మూడు అంచెల భద్రతా వ్యవస్థ కింద జాగ్రత్త పరిచారు. CCTV నిఘాతో పాటు ప్రతి స్ట్రాంగ్ రూమ్ క్యాంపస్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయబడింది.

= = = = = = = = = = = = = = = = = =

కేంద్ర వాణిజ్యం,  పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్ ఈరోజు న్యూఢిల్లీలో నేపాల్ మంత్రి అనిల్ కుమార్ సిన్హాతో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భారత్, నేపాల్ దేశాల మధ్య రవాణా ఒప్పందానికి ప్రోటోకాల్‌ను సవరిస్తూ.. రెండు దేశాలు లెటర్స్ ఆఫ్ ఎక్స్ఛేంజ్ (LoE) చేసుకున్నాయి. ఈ లేఖ జోగ్బనీ-బిరాట్ నగర్ రైలు లింక్‌లో కంటైనర్, బల్క్ కార్గో రెండింటికీ ప్రత్యక్ష రైలు కనెక్టివిటీని అనుమతిస్తుందని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వ శాఖ తెలిపింది. అలాగే కోల్‌కతా, విశాఖపట్నం ఓడరేవుల నుండి నేపాల్ కస్టమ్స్ యార్డ్ కార్గో స్టేషన్‌కు రవాణాను కూడా ఇది సులభతరం చేస్తుందని పేర్కొంది. ఈ చొరవ రెండు దేశాల మధ్య మల్టీమోడల్ వాణిజ్య అనుసంధానాన్ని ఇతర దేశాలతో నేపాల్ వాణిజ్యాన్ని బలోపేతం చేస్తోందని మంత్రిత్వ శాఖ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = =

భారత పరిశ్రమల సమాఖ్య (CII) భాగస్వామ్య సదస్సు విశాఖపట్టణం వేదికగా రేపటి నుండి రెండు రోజుల పాటు జరగనుంది. ఈ సదస్సుని ఉప రాష్ట్రపతి సీ పీ రాధాకృష్ణన్ రేపు ఉదయం ప్రారంభించనున్నారు. ఈ సదస్సును సీఐఐ ఆధ్వర్యంలో భారత ప్రభుత్వ వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వ శాఖలోని పరిశ్రమ, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (DPIIT), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాగస్వామ్యంతో నిర్వహిస్తోంది. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో 72 మంది అంతర్జాతీయ వక్తలు, 45 దేశాల నుంచి 300 మంది విదేశీ ప్రతినిధులు సహా 2,500 మంది ప్రతినిధులు పాల్గొననున్నారు. ఈ సదస్సు ద్వారా వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికతల భవిష్యత్ దిశను నిర్ణయించే చర్చలు జరగనున్నాయి.

విరామం

= = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) ఈరోజు న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (AIIMS)లో అత్యవసర పరిస్థితుల కోసం వెబ్ సైట్‌ను ప్రారంభించింది. ఏదైనా ప్యాండమిక్ లేదా అంటువ్యాధులు సంభవించినప్పుడు సకాలంలో ప్రజారోగ్య ప్రతిస్పందన కోసం పరిశోధనలు, అధ్యయనాలను వేగవంతం చేయడానికి ఇటువంటి ప్రపంచ నెట్‌వర్క్ వెబ్ సైట్‌ల ను ఏర్పాటు చేస్తున్నట్లు WHO తెలియజేసింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భారతదేశంలో WHO ప్రతినిధి పేడెన్, AIIMS డైరెక్టర్ డాక్టర్ ఎం. శ్రీనివాస్ పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 19వ తేదీన తమిళనాడులోని కోయంబత్తూరులో పర్యటించనున్నారు. తమిళనాడులోని రైతు సంఘాలు నిర్వహించే దక్షిణ భారత సహజ వ్యవసాయ సదస్సులో ప్రధానమంత్రి పాల్గొని ప్రసంగిస్తారు. దక్షిణాది రాష్ట్రాలకు చెందిన సేంద్రీయ వ్యవసాయంలో ప్రత్యేకత కలిగిన 50 మంది శాస్త్రవేత్తలతో కూడా నరేంద్రమోదీ సంభాషిస్తారు. విస్తృత ఆధారిత సహజ వ్యవసాయం కోసం విధి విధానాలు ఈ సదస్సులో రూపొందించబడతాయని, అలాగే సహజ వ్యవసాయ పద్ధతులను అవలంభించడంపై అవగాహన కల్పించనున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సమన్వయకర్త పి ఆర్ పాండియన్ తెలిపారు. ఆర్థికంగా, లాభదాయకంగా సమ్మిళిత వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లడం ఈ సదస్సు లక్ష్యమని వెల్లడించారు. ప్రముఖ శాస్త్రవేత్తలు, విధాన రూపకర్తల ఇంటరాక్టివ్ సెషన్‌లు, ప్రత్యక్ష ప్రదర్శనలను యువత, మహిళల భాగస్వామ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

దేశ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) విధానం కింద ప్రభుత్వం 100 కొత్త సైనిక్ పాఠశాలలను నిర్మించనున్నట్టు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. గుజరాత్‌లోని మోతీభాయ్ ఆర్.చౌదరి సాగర్ సైనిక్ స్కూల్, సాగర్ ఆర్గానిక్ ప్లాంట్‌ను కేంద్రమంత్రి దృశ్యమాధ్యమం ద్వారా ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ పాఠశాల దేశ గర్వానికి చిహ్నంగా మారుతుందని, గుజరాత్‌లోని వివిధ జిల్లాల పిల్లలు భారత సాయుధ దళాలలో సేవలందించడానికి మార్గం చూపుతుందన్నారు. అలాగే సాగర్ ఆర్గానిక్ ప్లాంట్ విస్తరణ దేశ వ్యాప్తంగా పౌరుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, ఆర్గానిక్ వ్యవసాయం చేస్తున్న రైతుల ఆదాయాన్ని కూడా పెంచుతుందని పేర్కొన్నారు. సహకార సంఘాలు ఉత్పత్తి చేసే పాలలో 50 శాతం జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లకు చేరేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని అమిత్ షా తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

కేరళ, మాహేలోని పలు ప్రాంతాల్లో రాగల రెండు రోజులలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) పేర్కొంది. అదేవిధంగా ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లలో తీవ్రమైన చలితో పాటు కొన్ని చోట్ల వర్షాలు కూడా కురుస్తాయని తెలిపింది. ఈశాన్య భారతదేశంలో పొగమంచు ఉంటుందని, కనిష్ట ఉష్ణోగ్రతలు రెండు నుండి మూడు డిగ్రీల సెల్సియస్ తగ్గుతాయని వాతావరణ శాస్త్రవేత్త శిబిన్ బాల కృష్ణన్ వివరిస్తూ...

(వాయిస్ 15 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు స్వల్ప లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 84,466 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై... చివరకు 12 పాయింట్లు లాభపడి 84,478 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 3 పాయింట్ల లాభంతో 25,879 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 88 రూపాయల 68 పైసలుగా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 62.80 డాలర్లుగా ఉండగా.. బంగారం ఔన్సు 4,237 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = =